సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



23 నుంచి బ్రహ్మోత్సవాలు

ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో 23న స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. 8లో▸



గంజాయి పట్టివేత

రామగుండం కమిషనరేట్ పోలీసులు 120 కిలోల గంజాయిని పట్టుకున్నారు. మొత్తం 15 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0/21.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. జిల్లాలో ఎండ తీవ్రంగా ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హైరిస్క్ గర్భిణులను గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి

సుల్తానాబాద్(పెద్దపల్లి): హైరిస్క్ గర్భిణులను గుర్తించాలని డీఎంహెచ్‌వో అన్నప్రసన్న కుమారి అన్నారు. హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, చికిత్స తదితర అంశాలపై కలెక్టరేట్‌లో డాక్టర్ ప్రవంతితో కలిసి ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, హైరిస్క్ గర్భిణుల వివరాలను అర్మాన్ యాప్‌లో నమోదు చేయాలని వివరించారు. వారికి సరైన సమయంలో సేవలు, సలహాలు అందించడం జరుగుతుందని, దీంతో మాతృ మరణాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఆరోగ్య కార్యకర్తల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

రికార్డుస్థాయి ఉత్పత్తి సాధించిన జీడీకే-11 గని

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధిలోని జీడీకే-11 గని రికార్డు స్థాయి బొగ్గు ఉత్పత్తి సాధించింది. ఈనెల 19న 2,800 టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను, 5,500 టన్నుల బొగ్గు వెలికి తీసి రికార్డు నెలకొల్పింది. ఈనెల 15న సంస్థ సీఎండీ బలరాం గనిని సందర్శించారు. ఈక్రమంలో ఉద్యోగులు ఇచ్చిన హామీ మేరకు రికార్డు స్థాయి బొగ్గు ఉత్పత్తి చేశారని, దీనికి సహకరించిన అధికారులు, కార్మికులకు ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు.

లోకో పైలట్‌ల నిరాహారదీక్ష



దీక్ష శిబిరంలో లోకోపైలట్‌లు

రామగుండం: సమస్యలు పరిష్కరించాలని దేశవ్యాప్తంగా చేపట్టిన నిరాహార దీక్షలో భాగంగా గురువారం రామగుండం రైల్వేస్టేషన్ ఆవరణలో స్థానిక లోకోపైలట్‌లు దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ, భారతీయ రైల్వేలో లోకోపైలట్‌ల పాత్ర ఎంతో ముఖ్యమైనదని, సరైన విశ్రాంతి ఇవ్వకుండా ఎక్కువ పనిగంటలు పని చేయిస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేవరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈసందర్భంగా కొంతమంది లోకోపైలట్‌లు సొమ్మసిల్లి పడిపోగా స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందించారు. కాగా ఈదీక్ష శిబిరాన్ని రైల్వే కార్మికసంఘాల నాయకులు వీరన్న, రాజ్‌కుమార్, సదయ్య సందర్శించి తమ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోషియేషన్ రామగుండం బ్రాంచ్ సెక్రటరీ సిహెచ్.రవి, ప్రెసిడెంట్ ఎస్‌కే పాల్, సచిన్, కిరణ్, వినోద్, సౌరవ్, వికాస్ పాల్గొన్నారు.

బహుగుళ్ల ఆలయ పరిధిలో విద్యుత్ లైన్ ప్రారంభం




డీటీఆర్‌ను ప్రారంభిస్తున్న డీఈ ప్రభాకర్, సిబ్బంది

ముత్తారం(మంథని): మండలంలోని మచ్చుపేటలో బహుగుళ్ల ఆలయానికి వెళ్లే మార్గమధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ డీటీఆర్‌ను గురువారం రాత్రి ట్రాన్స్‌కో డీఈ ప్రభాకర్ ప్రారంభించారు. ఎన్నికల ముందు మంత్రి శ్రీధర్‌బాబు ఇచ్చిన హామీ మేరకు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. భక్తులు, స్థానికుల విన్నపం మేరకు మంత్రి మంజూరు చేసిన రూ.12లక్షలతో విద్యుత్ పనులు చేపట్టారు. ఈ మేరకు ట్రాన్స్‌కో మంథని డీఈ ప్రభాకర్ పనులు పర్యవేక్షించారు. అపర కాశిగా పేరున్న బహుగుళ్ల ఆలయానికి వెళ్లేందుకు భక్తుల సౌకర్యార్థం రోడ్డు, విద్యుత్ పనులు పూర్తి చేయించిన మంత్రికి స్థానికులు కృతజ్ఞతలు తెలి పా రు. మాజీ సర్పంచులు గోవిందుల పద్మ ఆనంద్, మేడగోని సతీశ్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రచారంలో కొత్త పుంతలు

- అభ్యర్థుల చేతికి ఓటర్ల ఫోన్ నంబర్లు
- ఓటు వేయాలని అభ్యర్థనలు.. ఎవరికి వేస్తారనీ సర్వేలు
- ఆన్‌లైన్‌లో వ్యక్తిత్వ హననానికి దిగుతున్న పార్టీలు
- సోషల్ మీడియాలో పరస్పర ఆరోపణలకు దిగుతున్న అభ్యర్థులు
- కులాలు, వర్గాల వారీగా ఓటర్లకు విందులు, సమావేశాలు



విందులు, సమావేశాలు

ఎమ్మెల్సీ ఎన్నికల పుణ్యమాని.. కుల సంఘాల నాయకులకు ఎక్కడాలేని గిరాకీ పెరిగింది. పార్టీల అభ్యర్థులందరూ వీరిని మచ్చిక చేసుకుని మరీ సమావేశాలు పెడుతున్నారు. అవసరమైతే మందుపార్టీలు కూడా నడిపిస్తున్నారు. దీంతో కులసంఘాల నేతలు అభ్యర్థులందరినీ సంతృప్తి పరిచేలా వారితో తమ సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లతో సమావేశాలు ఏర్పాటు చేయిస్తున్నారు. ఇక గ్రాడ్యుయేట్స్, టీచర్స్, ప్రైవేటు లెక్చరర్లను కూడా విందులతో తమ వశం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్, టీచర్స్ నియోజకవర్గాల ఎన్నికల ప్రచారం కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు ఓటర్లను ఆకర్షించేందుకు.. అభ్యర్థులు గెలిస్తే తామేం చేస్తామో వివరిస్తూ ముందుకు సాగేవారు. తనను గెలిపించాలని సభలు, సమావేశాలు పెట్టి విజ్ఞప్తి చేసేవారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు గతానికి భిన్నంగా జరుగుతున్నాయి. గతంలో ఇద్దరు వ్యక్తులు లేదా రెండు పార్టీల మధ్య పోటీ కనిపించేది. ఈసారి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎన్నికల్లో అన్ని ముఖ్య పార్టీల నుంచి బలమైన అభ్యర్థులు రంగంలోకి దిగారు.ఫలితంగా వారి ప్రచారం.. తోటి అభ్యర్థులను అవమానించేలా సాగుతోంది. ఆరోపణలు చేసుకుంటూ.. ఓటర్లను కులాల వారీగా, వర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి ప్రలోభాలకు దిగుతుండటం, ఓటర్లను ఇబ్బంది పెట్టే ధోరణిలో ఫోన్‌కాల్స్ చేస్తుండటం కలవర పెడుతోంది.

సోషల్ మీడియాలో ఆరోపణలు

గెలవాలంటూ తామేం చేస్తామో చెప్పుకునే ధోరణి కంటే.. ఎదుటి వారి లోపాలు, వారు గతంలో చేసిన తప్పులను ఎత్తి చూపడమే కొందరు ప్రచారాస్త్రంగా మార్చుకున్నారు. ముఖ్యంగా రెండు జాతీయ పార్టీల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు అభ్యర్థులు పార్టీ సిద్ధాంతాలను పక్కనబెట్టి వారి సోషల్‌మీడియా ద్వారా పరస్పరం దూషించుకుంటున్నారు. వృత్తిపరంగా వ్యవహరించిన విధానాన్ని ఇప్పుడు గుర్తు చేసి వీళ్లేం సేవ చేస్తారు..? అని వ్యక్తిగత దాడులకు దిగుతున్నారు. ఫొటోలను డీటీపీ చేసి వారిని అవమానిస్తున్నారు. అలా నాయకులను కించపరిచేలా మార్చిన ఫొటోలను ఆయా పార్టీ, ఇతర వాట్సాప్ గ్రూపులు, సోషల్‌మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఆయా ఫొటోల కింద ఘాటైన పదజాలంతో దుర్భాషలాడుతూ కామెంట్లు పెడుతూ చెలరేగిపోతున్నారు. సూటిగా చెప్పాలంటూ ఎన్నికల ప్రచారం కంటే కూడా వ్యక్తిత్వ హననానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. మరో నాయకుడు అసలు ఎన్నికలు జరుగుతున్న తీరే సరిగా లేదని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానని ప్రతిన బూనిన సంగతి తెలిసిందే.

ఉదయం నుంచి సర్వేలు, కాల్స్

గ్రాడ్యుయేట్స్, టీచర్స్ నియోజకవర్గాలకు పోటీ చేస్తున్న అభ్యర్థుల చేతికి ఓటర్ల ఫోన్ నంబర్ల జాబితా చిక్కింది. ఫలితంగా ఓటర్లకు ప్రైవసీ లేకుండా చేస్తున్నారు. ఓటరు జాబితాలో పేరున్న ప్రతీ ఓటరుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు వరుసగా ఫోన్లు చేస్తున్నారు. దీనికితోడు ఏ పార్టీకి ఎందుకు ఓటేస్తున్నారు..? అంటూ రోజుకు నాలుగైదు సార్లు వివిధ పార్టీలు ఐవీఆర్ ద్వారా ఫోన్‌లో నిర్వహిస్తున్న సర్వేలు చికాకు తెప్పిస్తున్నాయి. ఓటర్లంతా గ్రాడ్యుయేట్లే కావడంతో మీరు చెప్పిన అభ్యర్థికి ఎందుకు ఓటేయాలి..? అని చాలామంది ప్రశ్నిస్తుండటం గమనార్హం.



ఒత్తిడి జయిస్తే.. విజయమే



- పదోతరగతి, ఇంటర్ విద్యార్థులు ప్రణాళికతో చదవాలి
- సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలంటున్న నిపుణులు
- మార్చి 5 నుంచి ఇంటర్, 21 నుంచి పదోతరగతి పరీక్షలు

మార్చి.. విద్యార్థులకు పరీక్షా కాలం.. చదివిన చదువులకు ఫలితం కోసం శ్రమించే సమయం. మార్చిలో విద్యార్థులకు కీలకమైన ఇంటర్, పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. మార్చి 5 నుంచి ఇంటర్, 21 నుంచి పదోతరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దని పలువురు నిపుణులు సూచిస్తున్నారు. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెబుతున్నారు. శోధించాలన్న తపనతో సాధన చేస్తే ఎంతటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని అంటున్నారు. ఇటీవలి కాలంలో దీన్ని పలువురు రుజువు చేస్తూ పలు వార్షిక, పోటీ పరీక్షల్లో రాణిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొంటున్నారు. పరీక్షలంటే భయం వీడాలని, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి.. ఒత్తిడి జయిస్తే విజయం సొంతమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

– సప్తగిరికాలనీ(కరీంనగర్)

- వివరాలు 8లో▸

ఇసుక రవాణా వాహనాలపై ప్రత్యేక నిఘా



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

- రామగుండం సీపీ శ్రీనివాస్

ముత్తారం(మంథని): ఇసుక రవాణా వాహనాలపై ప్రత్యేక నిఘా పెడుతామని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. ముత్తారం మండలం ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి మానేరులో నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌లను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెద్దపల్లి జోన్‌లో మంథని, ముత్తారం పోలీస్‌స్టేషన్‌లోని ఇసుక రీచ్‌ల నిర్వహణపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాహనాల వే బిల్స్, లోడ్ పరిమితిని పరిశీలించారు. ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న ర్యాంపుల నుంచి ఇసుక తరలించే విధానాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ఇసుక వాహనాల తనిఖీ వివరాలు తప్పకుండా నమోదు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆదాయనికి గండికొట్టేలా ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేసే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పోలీసు శాఖ చర్యలు చేపడుతుందనన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ డా.చేతన, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర, గోదావరిఖని ఏసీపీ రమేశ్, మంథని సీఐ రాజు, ఎస్సై నరేశ్ ఉన్నారు.

పారిశుధ్యంపై దృష్టిపెట్టండి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో పారిశుధ్యం మెరుగుపర్చడంపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి కోయ శ్రీహర్ష ఆదేశించారు. నగరపాలక పనితీరుపై గురువారం అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ,తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధుల ద్వారా చేపట్టిన నగరాభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, ఆస్తి పన్ను వసూలు, టౌన్ ప్లానింగ్ తదితర అంశాలపై కలెక్టర్ తెలుసుకున్నారు. వరద నియంత్రణ పనులకు ప్రాధాన్యత కల్పిస్తూనే పనులన్నింటినీ త్వరగా పూర్తి చేయాలని, పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించాలని సూచించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు గడువులోగా ఆస్తి పన్ను వసూలు చేయాలని, నగరంలో రోడ్లపై చెత్త లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌ఈ శివానంద్, ఈఈ రామణ్, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై సమీక్ష

కోల్‌సిటీ(రామగుండం): ప్రీ స్కూల్‌లో పిల్లలకు బోధన పకడ్బందీగా జరగాలని అధికారులను కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై, గురువారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతీ సూపర్‌వైజర్ తన పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను రెగ్యులర్‌గా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతినెలా పిల్లల బరువు చెక్ చేయాలని, తక్కువ బరువు ఉన్న పిల్లలకు అవసరమైన పోషకాలు అందించాలని సూచించారు.గ్రామాల్లో క్రొనిక్ వ్యాధులు గుర్తించిన 14 మందికి జిల్లా వైద్యా శాఖ ద్వారా అవసరమైన పరీక్షలు నిర్వహించి చికిత్స అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, సీడీపీవో అలేఖ్య, అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

పెద్దపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డ్‌లో వివరాలు, బయోమెట్రిక్ అప్ డేట్ చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా స్థాయి ఆధార్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. 5 నుంచి 15 సంవత్సరాల లోపు గల ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేయించాలని సూచించారు.

వేగవంతంగా పూర్తి చేయాలి

ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఇందిరమ్మ ఇండ్లను గ్రౌండ్ చేసేందుకు అధికారులు సన్నద్ధం కావాలని, మోడల్ ఇందిరమ్మ ఇళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బరిలో రామగుండం

- ఈనెల 17న కేంద్రం విడుదల చేసిన మార్కుల జాబితా
- స్వచ్ఛత ర్యాంకులో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ ప్రాధాన్యం
- నగర ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ

#Alert# Swachh Survekshan Feedback Started

Citizens can give feedback via Vote For My City App, Swachhata App & QR codes.
Scan the QR code / visit sbmurban.org/feedback

క్యూఆర్ కోడ్



సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్న మెప్మా సిబ్బంది

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వచ్చిన ర్యాంకులు

సంవత్సరం	2023	2022	2021	2020	2019	2018	2017
ర్యాంకు	175	136	92	211	192	194	191

కోల్‌సిటీ(రామగుండం): దేశంలోని పట్టణాలు, నగరాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో ఏటా పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక క్యూసీఐ బృందం పోటీ చేస్తున్న పట్టణాలు, నగరాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఆన్‌లైన్‌లో మార్కులు వేస్తారు. ఈ మార్కుల ఆధారంగానే కేంద్రం స్వచ్ఛత ర్యాంకులు ప్రకటిస్తోంది. ×స్వచ్ఛ సర్వేక్షణ్-2024₹కు సంబంధించి మార్కుల జాబితాను ఈనెల 17న కేంద్రం ఆయా మున్సిపాలిటీలకు పంపించింది. ఈ పోటీలో ప్రజల అభిప్రాయాల(సిటిజన్ ఫీడ్‌బ్యాక్) సేకరణ కీలకం కాగా, రామగుండం నగరపాలక సంస్థ కూడా పాల్గొంటోంది.

మార్చి 5 వరకు గడువు

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌కు 5శాతం మార్కులు కేటాయించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు కేంద్రం క్యూఆర్ కోడ్ విడుదల చేసింది. అయితే సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌కు మార్చి 5వరకు మాత్రమే గడువు విధించింది. దీంతో అదనపు కలెక్టర్, నగరపాలక కమిషనర్(ఎఫ్ఏసీ) జే.అరుణశ్రీ ప్రత్యేక దృష్టిసారించారు. గురువారం మెప్మా సిబ్బందితో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ ద్వారా సాధ్యమైనంత ఎక్కువ మొత్తంలో అభిప్రాయాలు సేకరించాలని ఆదేశించారు. ఈక్రమంలో మెప్మా సిబ్బంది నగర ప్రజలను కలుసుకొని అభిప్రాయం చెప్పిన వారితోనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

పూర్తయిన డాక్యుమెంటేషన్ ప్రక్రియ

- కేంద్రం సూచన మేరకు స్వచ్ఛ సర్వేక్షణ్-2024 కోసం ఇప్పటికే రామగుండం బల్దియాకు చెందిన డాక్యుమెంటేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. సిటిజన్ ఫీడ్‌బ్యాక్ పూర్తి చేసిన తర్వాత ఢిల్లీ నుంచి ప్రత్యేక క్యూసీఐ బృందం నగరానికి రానుంది. ఈ బృందం నగరంలో క్షేత్రస్థాయిలో పారిశుధ్యం పనితీరుపై గోప్యంగా ఆన్‌లైన్‌లో మార్కులు వేయనుంది.

ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ కోసం ఆశలు

- రామగుండం బల్దియాకు ప్రస్తుతం ఓడీఎఫ్ ప్లస్ (బహిరంగ మలవిసర్జన రహితం) గుర్తింపు మాత్రమే ఉంది. ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ గుర్తింపు కోసం ఇటీవల కేంద్రానికి దరఖాస్తు చేశారు. అయితే రామగుండంలో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ) పూర్తయినా వినియోగంలోకి రాలేదు. మల్కాపూర్ శివారులో వినియోగంలో ఉన్న ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్టీపీ) ద్వారా ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ గుర్తింపు వస్తుందని అధికారులు ఆశిస్తున్నారు.

ఫీడ్‌బ్యాక్‌లోని 10 ప్రశ్నలు

- చెత్త సేకరణకు రోజూ ఇంటికి, దుకాణానికి వస్తున్నారా?
- మీ నివాస ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఊడుస్తున్నారా?
- మీ ప్రాంతానికి సమీపంలో తరుచూ పేరుకుపోయిన చెత్త కుప్పలను....... చూస్తున్నారు?
- చెత్త పారేయడానికి ముందు ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారా?
- చెత్తను వేరు చేసి వాహనానికి ఇస్తున్నారా, అన్నింటినీ కలిపి ఇస్తున్నారా?
- మార్కెట్లు, బజార్లు, పార్కులు, బహిరంగ ప్రదేశాల పరిశుభ్రత నిర్వహించడంలో స్థానిక అధికారులు ఎంతో ప్రభావవంతంగా ఉన్నారనుకుంటున్నారా?
- వ్యర్థ పదార్థాల నిర్వహణకు మీ నగరంలో ఉన్న తగ్గించు, పునర్వినియోగం, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాల గురించి తెలుసా?
- మురుగుకాలువలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయడానికి, లైసెన్స్ పొందిన ఆపరేటర్లను మాత్రమే నియమించాలని మీకు తెలుసా?
- మీ ప్రాంతంలోని పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రత, నిర్వహణతో ఎంత మేర సంతృప్తి చెందారు?
- పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ఎప్పుడైనా స్థానిక అధికారులకు నివేదించారా? దానిని ఎలా పరిష్కరించారు?

రామగుండం నగర పారిశుధ్య విభాగం ప్రొఫైల్

మొత్తం డివిజన్లు	50
విస్తీర్ణం	93.87 చదరపు కిలోమీటర్లు
జనాభా(2011 లెక్కల ప్రకారం)	2,29,644
మురికివాడలు	92
అసెస్‌మెంట్ల ప్రకారం గృహాలు	50,956

స్వచ్ఛ సర్వేక్షణ్- 2024కు కేటాయించిన మార్కులు

కేటాయించిన మార్కులు మొత్తం	12,500
గార్బెజ్ ఫ్రీ సిటీ విభాగానికి	1,300
ఓడీఎఫ్, ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్, వాటర్ ప్లస్	1,200
ఇతర విభాగాల అంశాలకు	10,000

సకాలంలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలి

కోల్‌సిటీ(రామగుండం): వ్యాపారులు సకాలంలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించి నగరపాలక సంస్థకు సహకరించాలని అదనపు కలెక్టర్, రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) జె.అరుణశ్రీ కోరారు. కొత్తగా ట్రేడ్ లైసెన్స్ పొందాలనుకునే వారు, రెన్యువల్ చేసుకునేవారు https:emunicipal.telangana.gov.in వెబ్‌సైట్ లేదా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గది కొలతలు నమోదు చేసేటప్పుడు కచ్చితమైన వివరాలు ఇవ్వాలన్నారు. తప్పుడు కొలతలు నమోదు చేసినట్లు తనిఖీలో గుర్తిస్తే 25 రెట్ల పెనాల్టీ విధించడం జరుగుతుందని పేర్కొన్నారు. కొలతల్లో మార్పు అవసరమైతే నగరపాలక సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవా లని సూచించారు. నగదు చెల్లింపులు లేకుండా ఆన్‌లైన్ విధానంలోనే ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలన్నారు. ట్రేడ్ లైసెన్స్‌కు సంబంధించి వచ్చే ఫేక్ కాల్స్‌కు స్పందించి మోసపోవద్దని పేర్కొన్నారు. ట్రేడ్ లైసెన్స్‌కు సంబంధించి పూర్తి వివరాలు కావలసిన వారు నగరపాలక సంస్థ కార్యాలయంలోని పారిశుధ్య విభాగంలో సంబంధిత అధికారిని స్వయంగా లేదా 99666 26680 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

'ప్రజలకు ఏం చేశారో చెప్పాలె'

మంథని: మంథని నియోజకవర్గ ప్రజలు అధికారం కట్టబెడితే మీ పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు డిమాండ్‌చేశారు. గురువారం నియోజకవర్గ ప్రజల తరఫున బాధ్యతలను గుర్తు చేస్తూ స్థానిక ఎమ్మెల్యేకు బహిరంగ లేఖ పంపిస్తున్నట్లు తెలిపారు. ఎన్నో ఆశలతో ప్రజలు గెలిపిస్తే మంత్రిగా అధికారం పొంది ఈ ప్రాంతానికి మంచి చేయాలనే ఆలోచన కూడా చేయడం లేదన్నారు. నియోజకవర్గంలోని మంథని, కాటారంలో ఒకటి చొప్పున ఐటీ కంపెనీ, రెండు పరిశ్రమలు ఏర్పాటు చేయించాలన్నారు. నాయకులు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, మాచిడి రాజు గౌడ్, కిషన్‌రెడ్డి, పుప్పాల తిరుపతి ఉన్నారు.

క్లుప్తంగా

మహాశివరాత్రి జాతర ఉత్సవ కమిటీ ఏర్పాటు

వేములవాడ: ఎములాడ రాజన్న ఆలయంలో ఈ నెల 23 నుంచి 28 వరకు జరిగే మహాశివ రాత్రి జాతరకు 29 మంది సభ్యులతో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ ఏర్పాటుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సభ్యులు అనుముల చంద్రం, వడ్డేపల్లి వెంకటరమణ, కె.రాజిరెడ్డి, సి.విజయలక్ష్మి, సాగరం వెంకటస్వామి, పాత సత్యలక్ష్మి, కూరగాయల కొమురయ్య, సంద్రగిరి శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, పులి రాంబాబు, తూము సంతోష్, వకుళాభరణం శ్రీనివాస్, పిల్లి కనకయ్య, సంగ స్వామి, జగన్మోహన్ రెడ్డి, చేపూరి గంగయ్య, చింతపల్లి రామస్వామి, కాయతి నాగరాజు, తొట్ల అంజయ్య, ఏనుగు రమేశ్ రెడ్డి, సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, ధర్న మల్లేశం, ఒలిమినేని నిత్యానందరావు, గొట్టె ప్రభాకర్, బుస్సా దశరథం, తాటికొండ పవన్, ముప్పిడి శ్రీధర్, సుగూరి లక్ష్మి, తోట లహరి కృతజ్ఞతలు తెలిపారు.

కుక్క దాడిలో 10 మందికి గాయాలు



పాప గాయాన్ని పరిశీలిస్తున్న వైద్యురాలు

సిరిసిల్ల కల్చరల్: కుక్క దాడిలో 10 మంది గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల బీవైనగర్‌కు చెందిన ఉమాదేవి, రాణి, లత, రామచంద్రం, లక్ష్మి, భూలక్ష్మి, విజయ, విఠల్, శేఖర్‌తోపాటు ఐదేళ్ల పాప వైశాలిపై గురువారం కుక్క దాడి చేసింది. ఈ ఘటనలో అందరికీ గాయాలయ్యాయి. బాధితులను సుందరయ్యనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్ సాహితి వారికి చికిత్స అందించారు.

కోరుట్లలో తల్లీకూతురికి..

కోరుట్ల: పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన వెల్లుల్ల గౌతమి, ఆమె కూతురు ధాన్విలపై గురువారం రాత్రి కుక్క దాడి చేసింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం స్థానికులు ఆ కుక్కను చంపేశారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

పాలకుర్తి(రామగుండం): నాటుసారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రామగుండం ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పాలకుర్తి మండలంలోని జీడీనగర్‌కు చెందిన పల్లపు వెంకట్ గురువారం ద్విచక్రవాహనంపై నాటుసారా తరలిస్తున్నాడు. అదే సమయంలో జీడీనగర్ నుంచి బసంత్‌నగర్ వెళ్లే దారిలో ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. వెంకట్‌ను ఆపి, తనిఖీ చేయగా 8 లీటర్ల నాటుసారా లభ్యమైంది. నాటుసారా స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ ఖదీర్, కానిస్టేబుళ్లు శ్రవణ్, నరేశ్, రాజు, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఒత్తిడి జయిస్తే.. విజయమే

- పదోతరగతి, ఇంటర్ విద్యార్థులు ప్రణాళికతో చదవాలి
- యోగా, ధ్యానం చేయాలి
- సమతుల ఆహారం తీసుకోవాలి
- సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలంటున్న నిపుణులు
- మార్చి 5 నుంచి ఇంటర్, 21 నుంచి పదోతరగతి పరీక్షలు



ధ్యానం చేస్తున్న కరీంనగర్ క్రీడా పాఠశాల పదోతరగతి విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు.. శోధించాలన్న తపనతో సాధన చేస్తే ఎంతటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చు. ఇటీవలి కాలంలో దీన్ని పలువురు రుజువు చేస్తూ పలు వార్షిక, పోటీ పరీక్షల్లో రాణిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. విద్యార్థులకు పరీక్షల కాలం వచ్చేసింది. మార్చి 5 నుంచి ఇంటర్, 21 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారు. కానీ, పరీక్షలంటే భయం వీడాలని, ఒత్తిడి జయిస్తే విజయం సొంతమవుతుందని నిపుణులు చెబుతున్నారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల కోసం ప్రత్యేక కథనం.

విద్యార్థులు, తల్లిదండ్రులు ఇవి పాటించాలి..

➡ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులు మొబైల్, ఇంటర్నెట్, సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలి.

➡ జంక్ ఫుడ్, బయటి ఆహార పదార్థాలు తీసుకోవద్దు.

➡ పండ్ల రసాలు, స్వీట్, నెయ్యి, వాటర్ మిలాన్, డ్రై ఫ్రూట్స్ వంటివి ఎక్కువగా తీసుకోవాలి. రాత్రి పడుకునే ముందు ఒక గ్లాస్ పాలు తాగాలి.

➡ ప్రతీరోజు యోగా, ధ్యానం చేయాలి. దీనివల్ల చదువుపై ఏకాగ్రత వస్తుంది. పద్మాసనం, శశాంకాసనం, గోముకాసనం, శవాసనం వేస్తే మంచిది.

➡ రోజుకు కనీసం 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలి. 15 నుంచి 20 నిమిషాల శారీరక వ్యాయామం చేయాలి.

➡ విద్యార్థులు మంచి ఆహారం, విశ్రాంతి తీసుకునేలా తల్లిదండ్రులు చూడాలి. ఇతర విద్యార్థులతో పోల్చవద్దు.

➡ ఎక్కువ సమయం చదవాలని ఒత్తిడి చేయొద్దు.

ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు

జిల్లా	పదోతరగతి	ఇంటర్ ఫస్టియర్	సెకండియర్
కరీంనగర్	12,516	17,799	17,763
జగిత్యాల	12,059	7,067	7,370
రాజన్న సిరిసిల్ల	6,768	5,065	4,245
పెద్దపల్లి	6,393	5,844	5,141

పిల్లలతో స్నేహంగా ఉండాలి.

➡ టీచర్లను సంప్రదిస్తూ సలహాలు తీసుకోవాలి.

హెల్ప్‌లైన్ నంబర్‌లో సంప్రదించాలి

పరీక్షల సమయంలో మానసిక రుగ్మతలకు గురయ్యే విద్యార్థుల కోసం తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. ప్రతీరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత కన్సల్టేషన్, కౌన్సెలింగ్ కోసం 94404 88571 లేదా 040-35717915 నంబర్‌లో సంప్రదించాలి.

టెన్షన్ పడొద్దు



విద్యార్థులు టెన్షన్ పడకుండా పరీక్షలకు హాజరు కావాలి. మా పిల్లలకు ఇంటర్ విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాం. పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలో వివరించాం.

– ఎ.నిర్మల, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల కళాశాల, కరీంనగర్

క్లిష్టమైన టాపిక్స్‌పై ఫోకస్



నేను ఉదయం 3:30 గంటలకే నిద్ర లేచి, చదువుకునేదాన్ని. క్లిష్టమైన టాపిక్స్‌పై ఫోకస్ పె ట్టాను. అర్థం కాని పాఠ్యాంశాలను టీచర్లను అడిగి, మళ్లీ చె ప్పించుకున్న. మా అమ్మా నాన్న, ఉపాధ్యాయులు సహకారం అందించారు. నేను పడిన కష్టానికి 10 జీపీఏ వచ్చింది.

– దుర్శెట్టి నందిని, 2023–24 ఎస్సెస్సీ 10 జీపీఏ, కరీంనగర్

భయాన్ని తొలగించాలి



పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమేనని తల్లిదండ్రులు గుర్తించాలి. ఇంట్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చూడాలి. విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని తొలగించే ప్రయత్నం చేయాలి.

– ఎంఏ.కరీం, సైకాలజిస్టు, కరీంనగర్

మంచి ఆహారం తీసుకోవాలి



పరీక్షలు రాసే విద్యార్థులు మంచి ఆహారం, త్వరగా జీర్ణమయ్యే పదార్థాలు తీసుకోవాలి. బయటి ఫుడ్‌కు దూరంగా ఉండాలి. డ్రైఫ్రూట్స్, జ్యూస్, పండ్లు ఎక్కువగా తినాలి. పడుకునే ముందు పాలు తాగాలి.

– శ్వేత, డైటీషియన్, కరీంనగర్

టీవీ, ఫోన్ చూడొద్దు



పరీక్షల సమయంలో విద్యార్థులు టీవీ, ఫోన్ చూడొద్దు. అవి ఎంటర్‌టైన్‌మెంట్ కన్నా ఒత్తిడినే ఎక్కువ కలిగిస్తాయి. బ్రీథింగ్ ఎక్సర్‌సైజ్ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

– డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

120 కిలోల గంజాయి పట్టివేత



గంజాయి, నిందితులను చూపుతున్న సీపీ శ్రీనివాస్

- 15 మంది అరెస్టు
- గంజాయితోపాటు 2 కార్లు, 5 బైక్‌లు, 17 ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): రామగుండం కమిషనరేట్ పోలీసులు 120 కిలోల గంజాయిని పట్టుకున్నారు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు జీడీకే-11 గని క్రాస్ వద్ద 96.770 కిలోలు, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ రోడ్డులోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా షాపింగ్ కాంప్లెక్స్ సెల్లార్‌లో 23.50 కిలోల గంజాయిని పట్టుకున్నారని సీపీ ఎం శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 15 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వివరాలు వెల్లడించారు.

గోదావరిఖని టూటౌన్ పరిధిలో..

గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడీకే-11 గని క్రాస్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో 2 కార్లలో తరలిస్తున్న 96.770 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన ఉదయ్‌వీర్, రాజస్థాన్‌లోని దోల్పూర్‌కు చెందిన రాజ్‌లోధి, ఒడిశాలోని కోరుపుత్‌కు చెందిన కేశవ్‌ఖోరా, సోమంత ఖోరాలను అరెస్ట్ చేశారు. కారు యజమాని సూరజ్, గంజాయి సరఫరాదారు ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌కు చెందిన అర్జున్‌ఖోరిలు పరారీలో ఉన్నట్లు సీపీ తెలిపారు. గంజాయితోపాటు కార్లు, 6 ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జగదల్‌పూర్ నుంచి మంథని మీదుగా మహారాష్ట్రకు గంజాయి తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పట్టుకున్నట్లు వెల్లడించారు.

మంచిర్యాల జిల్లా కేంద్రంలో..

మంచిర్యాలలో సీసీ కెమెరాల వ్యాపారం ముసుగులో గంజాయి రవాణా చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు సీపీ శ్రీనివాస్ తెలిపారు. 23.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆయన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ రోడ్‌లో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కాంప్లెక్స్ సెల్లార్‌లో సోమ ప్రవీణ్‌కుమార్ వైఇన్‌ఫోం సొల్యూషన్స్ పేరిట సీసీ కెమెరాల గోడౌన్ నిర్వహిస్తున్నాడు. కానీ, అందులోనే గంజాయి నిల్వ ఉంచారు. పక్కా సమాచారం రావడంతో మంచిర్యాల పోలీసులు గోడౌన్ వద్దకు వెళ్లి, అనుమానస్పదంగా కనిపించిన కొంతమంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, విచారించగా గంజాయి నిల్వలు బయట పడ్డాయి. మంచిర్యాల జిల్లా రాజీవ్‌నగర్‌కు చెందిన ఇరుగురాళ్ల సతీశ్‌కుమార్, సప్తగిరికాలనీకి చెందిన మహమ్మద్ సమీర్, ఓ బాలుడు, అశోక్‌రోడ్‌కు చెందిన భీమ అనుదీప్, తిలక్‌నగర్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ ఉబేద్, రాజీవ్‌నగర్‌కు చెందిన జాగి రాఘవేంద్రస్వామి, నస్పూర్‌కు చెందిన గూడూరు రాము, ఎస్‌కే.అథార్‌హూర్, ఎస్‌కే.సమీర్, కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన అర్జున బాబు రావుచౌహాన్, కార్వాన్ నాగడ్డకు చెందిన మమమ్మద్ అజీజ్‌లను అరెస్ట్ చేయగా, మరో 11 మంది పరా రీలో ఉన్నట్లు సీపీ పేర్కొన్నారు. గంజాయితోపాటు 11 ఫోన్లు, 5 బైక్‌లు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషిన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సతీశ్‌కుమార్ డ్రైవర్‌గా పనిచేస్తూ సీసీ కెమెరాల వ్యాపారం చేసే ప్రవీణ్‌కుమార్‌తో కలిసి గంజాయి వ్యాపారానికి దిగినట్లు వెల్లడించారు. సీలేరు వద్ద తక్కువ ధరకు ఎండు గంజాయి తెచ్చారని పేర్కొన్నారు. గంజాయి ముఠాలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన స్పెషల్ బ్రాంచి, టాస్క్‌ఫోర్స్, గోదావరిఖని టూటౌన్, మంచిర్యాల పోలీసులను ఆయన అభినందించారు. పెద్దపల్లి డీసీపీ చేతన, అడ్మిన్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్ర, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, సీఐలు రాజ్‌కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తీర్పు రాకముందే సీఈసీ ప్రకటనా?



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

కరీంనగర్: సుప్రీంకోర్టు తీర్పు రాకముందే సీఈసీని ఎలా ప్రకటిస్తారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, ప్రధాన న్యాయమూర్తి ఉండే కమిటీలో చర్చించకుండా సీఈసీగా జ్ఞానేశ్‌కుమార్‌ను ఏకపక్షంగా ప్రకటించారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను ప్రధాని మోదీ మంటగలుపుతున్నారని, పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనను స్వాగతిస్తున్నామని, ఇదే తరహాలో దేశవ్యాప్తంగా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్‌ఎస్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని, పార్టీలు మారిన వారిపై స్పీకర్ చర్యలు తీసుకోవాలన్నారు. కమ్యూనిస్టుల గురించి కేసీఆర్ మాట్లాడటం అంటే సూర్యునిపై ఉమ్మేసినట్టేనన్నారు. మేడిగడ్డపై జ్యుడీషియల్ విచారణ జరుగుతున్న నేపథ్యంలో రాజలింగ మూర్తి హత్య అనేక అనుమానాలు తావిస్తోందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపు కోసం సీపీఐ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బామండ్లపెల్లి యుగంధర్, న్యాలపట్ల రాజు, బోనగిరి మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

నాంపల్లిలో వివాహిత ఆత్మహత్య

- నెల క్రితం రోడ్డు ప్రమాదంలో భర్త మృతి
- రెండు ఘటనలకు ఓ వ్యక్తి కారణమని కుటుంబీకుల ఆరోపణ
- మృతదేహంతో అతని ఇంటి ఎదుట ఆందోళన

కోనరావుపేట(వేములవాడ): ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది.. ఆమె భర్త నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఈ రెండు ఘటనలకు ఓ వ్యక్తి కారణమని మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపించారు. ఆమె మృతదేహంతో అతని ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. వారి వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం బావుసాయిపేట శివారులోని రామన్నపల్లెకు చెందిన బత్తుల మల్లయ్య గత నెల 19న రామన్నపల్లె శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో అతని భార్య రేణ(28) ముగ్గురు పిల్లలతో కలిసి, కొన్ని రోజులుగా వేములవాడ మండలంలోని నాంపల్లిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో ఆమె తీవ్ర మనోవేదనకు గురవుతోంది. గురువారం అద్దె ఇంట్లోనే ఉరేసుకుంది. అయితే, రేణ ఆత్మహత్య, ఆమె భర్త మృతికి రామన్నపల్లెకు చెందిన అంజయ్య కారణమని మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపించారు. రేణ మృతదేహంతో అతని ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వచ్చి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో ఆగ్రహించిన స్థానికులు అంజయ్య ఇంటి పైకప్పును ధ్వంసం చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రామన్నపల్లెలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. ఈ ఘటనపై ఎస్సై ప్రశాంత్‌రెడ్డిని వివరణ కోరగా.. రేణ ఆత్మహత్యపై బాధిత కుటుంబసభ్యుల నుంచి తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

క్షుద్రపూజల కలకలం



దుర్శేడ్ హైస్కూల్లో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు

కరీంనగర్‌రూరల్: మనిషి చంద్ర మండలంలోకి వెళ్తున్న ఈ కాలంలో గ్రామీణులు కొందరు ఇంకా మూఢనమ్మకాలపైనే ఆధారపడుతున్నారు. దుర్శేడ్ ఉన్నత పాఠశాల, చెర్లభూత్కూర్‌లో ఓ అంగన్‌వాడీ టీచర్ ఇంటి ఎదుట క్షుద్రపూజలు చేయడం గురువారం కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. దుర్శేడ్ హైస్కూల్లో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రధానోపాధ్యాయుడి గది ఎదుట పసుపు, కుంకుమతో ముగ్గులు వేసి, నిమ్మకాయలు పెట్టి, క్షుద్ర పూజ చేశారు. మరుసటిరోజు ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు వాటిని చూసి, భయభ్రాంతులకు గురయ్యారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రత్నాకర్ వెంటనే వాటిని తొలగించారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఇలా చేసి ఉంటారని, ఎవరూ భయపడవద్దని ధైర్యం చెప్పారు. అలాగే, చెర్లభూత్కూర్‌లో ఓ అంగన్‌వాడీ టీచర్ ఇంటి ఎదుట క్షుద్రపూజలకు సంబంధించిన వస్తువులను పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

ఆర్‌ఐపై ఆర్డీవోకు ఫిర్యాదు

మంథని: ముత్తారం ఆర్‌ఐ శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఖమ్మంపల్లికి చెందిన తీర్థల కొమురెల్లి గురువారం ఆర్డీవోకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల ప్రకారం.. ముత్తారం మండలం ఇప్పలపల్లి శివారులోని 9 గుంటల వ్యవసాయ భూమిని పట్టా చేయిస్తానంటూ కొమురెల్లి వద్ద ఆర్‌ఐ శ్రీధర్ రూ.10 వేలు తీసుకున్నాడు. కానీ, పని చేయలేదు. అడిగితే డబ్బులు పాత తహసీల్దార్‌కు ఇచ్చానని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని బాధితుడు ఆరోపించాడు. ఆర్‌ఐపై చర్యలు తీసుకొని, భూమిని తన పేరిట పట్టా చేయాలని ఆర్డీవోను కోరినట్లు తెలిపాడు.

కారు బోల్తా

జూలపల్లి(పెద్దపల్లి): పెద్దపల్లి మండలం లోకపేట కోళ్ల ఫాం వద్ద గురువారం ఓ కారు బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడినట్లు తెలిసింది. లోకపేట నుంచి కాచాపూర్ వరకు డబుల్ రోడ్డుగా మార్చేందుకు పనులు జరుగుతున్నాయి. ఈక్రమంలో పెద్దపల్లి నుంచి వెంకట్రావుపల్లె వైపు వస్తున్న కారు అదుపుతప్పి బోల్తాపడినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులను సంప్రదించగా, ఎవరు ఫిర్యాదు చేయలేదని, సమాచారం కూడా లేదని జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

ఏసీబీకి చిక్కిన ల్యాండ్ సర్వేయర్

- భూసర్వేకు రూ.20 వేలు డిమాండ్
- రూ.3 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



ఏసీబీకి పట్టుబడిన సర్వేయర్ గణేశ్

మంథని: భూ సర్వే కోసం డబ్బులు డిమాండ్ చేసిన ల్యాండ్ సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా గురువారం పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాలు.. మంథని మండల రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్‌గా పని చేస్తున్న జాటోతు గణేశ్ రెవెన్యూ గ్రామ శివారులోని రెడ్డి చెరువు వద్ద 814 /డి /1, 815/సి సర్వే నంబర్లలో ఎకరం భూ మిని కొలిచి రిపోర్టు ఇచ్చేందుకు మంథనికి చెందిన రైతు సువర్ణ క్రాంతినాగ్‌ను రూ.17 వేలు డిమాండ్ చేశా రు. ఈ నెల 5న రూ.9వేలు తీసుకున్నా డు. మిగిలిన డబ్బు డిమాండ్ చేయడంతో రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మరో రూ.3వేలు రెండో వాయిదాగా గురువారం ఇస్తానని ఫోన్ చేయగా, సర్వేయర్ ఆఫీసుకు కాకుండా బస్టాండ్‌కు రావాలని బాధితుడికి చెప్పాడు. దీంతో బాధితుడు రూ.3 వేలు బస్టాండ్‌లో సర్వేయర్ గణేశ్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో విచారణ జరిపి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని కోర్టులో హాజరు పరుచనున్నట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఏసీబీ సీఐలు తిరుపతి, కృష్ణకుమార్, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, కానిస్టేబుల్ శ్రీకాంత్, హోంగార్డులు అశోక్, సంతోష్ ఉన్నారు.

23 నుంచి ‘ఓదెల’ బ్రహ్మోత్సవాలు



స్వామివారు



ముస్తాబైన మల్లికార్జునస్వామి దేవస్థానం

ఓదెల(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఈ నెల 23న(ఆదివారం) స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అదేరోజు మహాగణపతి పూజ, గౌరీపూజ, సాయంత్రం ధ్వజారోహణం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, 24న ఉదయం 10:30 గంటల నుంచి భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం, 25న నాకబలి, గ్రామోత్సవం, 26న మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు నిత్యోత్సవం, 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సామూహిక రుద్రాభిషేకం, రాత్రి 8 గంటలకు రథోత్సవం, 11:45 గంటల నుంచి లింగోద్భవ కాలంలో మహన్యాసపూర్వక, ఏకాదశ రుద్రాభిషేకం, మహాహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరగనున్నాయి. ఆలయ ప్రధాన ద్వారాలు రంగులతో ముస్తాబయ్యాయి. ఉత్సవాలకు ఉత్తర తెలంగాణ జిల్లాలతోపాటు, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రానున్నారు. నీడ కోసం పందిళ్లు, మంచినీరు, విద్యుత్ దీపాలు, కోనేరు నీరు, గదులు తదితర ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయానికి కరీంనగర్, గోదావరిఖని, హుజూరాబాద్ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులతోపాటు సికింద్రాబాద్, కొత్తగూడెం, సిర్‌పూర్ కాగజ్‌నగర్‌ల నుంచి రైళ్ల సౌకర్యం ఉంది.

ఏర్పాట్లు పూర్తయ్యాయి..



ఈ నెల 23 నుంచి 26 వరకు జరిగే ఓదెల మల్లన్న బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. రాత్రిళ్లు జాగరణ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

– సదయ్య, ఈవో, ఓదెల దేవస్థానం

పెళ్లి పనులు చేసొస్తూ.. వాగులో పడి

- సింగరేణి కార్మికుడి దుర్మరణం
- కల్వచర్ల బొక్కలవాగు వద్ద బైక్ అదుపుతప్పి, ఘటన



రాజ్‌కుమార్ (ఫైల్)



వాగులో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రామగిరి(మంథని): చిన్నమ్మ కుమారుడి పెళ్లి పనులు చేసి, ఇంటికి వస్తున్నాడు.. బైక్ అదుపుతప్పి, వాగులో పడి, సింగరేణి కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రామగిరి మండలం లద్నాపూర్‌కు చెందిన ఊరగొండ రాజ్‌కుమార్(39) అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో అసిస్టెంట్ ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉద్యోగరీత్యా సెంటినరీకాలనీలోని జోన్-1 ఎస్టీటూ 559 క్వార్టర్‌లో ఉంటున్నాడు. గురువారం రాంపెల్లికి చెందిన తన చిన్నమ్మ కుమారుడి పెళ్లి మంథని మండలం ఎక్లాస్‌పూర్‌లో జరగనుండటంతో బుధవారం రాత్రి వరకు రాంపెల్లిలో వివాహ పనులు చేశాడు. గురువారం ఉదయం ఇంటికి వెళ్లి, అక్కడి నుంచి పెళ్లికి హాజరవుదామని బైక్‌పై బయలుదేరాడు. పెద్దపల్లి–మంథని ప్రధాన రహదారిలోని కల్వచర్ల బొక్కల వాగు వద్ద వాహనం అదుపుతప్పి, వంతెన పైనుంచి వాగులో పడింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సంఘటన స్థలాన్ని మంథని సీఐ రాజుగౌడ్, ఎస్సై దివ్య పరిశీలించారు. రాజ్‌కుమార్ మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం పొందిన ఒక్కగానొక్క కుమారుడు తమను పోషిస్తాడనుకుంటే చనిపోయాడంటూ మృతుడి తల్లిదండ్రులు గట్టమ్మ–శంకర్ కన్నీరుమున్నీరుగా విలపించారు.

నాగులపేటలో ఇసుక వివాదం

- రీచ్ ఓచోట.. తరలింపు మరోచోటు నుంచి
- కలెక్టర్ సీరియస్.. ఇసుక డంపుల సీజ్



నాగులపేట వాగు నుంచి అర్ధరాత్రి తరలుతున్న ఇసుక

కోరుట్ల: మండలంలోని నాగులపేటలో ఇసుక తరలింపు అంశం వివాదాస్పదంగా మారింది. రీచ్ ఓచోట ఉండగా.. మరోచోటు నుంచి తీసుకెళ్తుండటాన్ని కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల మండలంలోని పైడిమడుగు వాగు నుంచి ఇసుక తరలింపు కోసం రీచ్‌కు రెవెన్యూ అధికారులు అనుమతించారు. ఇక్కడి ఇసుక నాణ్యత తక్కువగా ఉండటంతో కొనుగోలుకు వినియోగదారులు ఇష్టపడటం లేదు. దీంతో ఇసుక రవాణాదారులు కొత్త దారిని ఎంచుకున్నారు. పైడిమడుగు ఇసుక రీచ్ పేరిట ఒక్కో ట్రాక్టర్‌కు రూ.800 డీడీలు కట్టి, వాటి ఆధారంగా ఇసుక బాగుండే నాగులపేట వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్నారు. అంతేకాదు, ఒకటి, రెండు ట్రాక్టర్ల ఇసుక తీసుకెళ్లేందుకు డీడీలు కట్టి, పొద్దంతా అడ్డగోలుగా రవాణా చేస్తున్నారు. ఈ వ్యవహారం కలెక్టర్ సత్యప్రసాద్ వరకు వెళ్లడంతో ఆయన సీరియస్ అయ్యారు. స్వయంగా నాగులపేట వాగు వద్దకు వచ్చి, పరిశీలించారు. వాగు పరిసరాల్లో ఉన్న ఇసుక డంపులను సీజ్ చేయాలని ఆదేశించడంతో అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ కిషన్‌ను వివరణ కోరగా.. ఇసుక, మొరం తరలింపుపై కఠినంగా వ్యవహరిస్తున్నామని, అక్రమ రవాణా చేస్తే జరిమానా విధించడంతోపాటు వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.